సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 31 । మే । 2023



కార్గో సేవలను ఆదరించండి

టీఎస్ ఆర్టీసీ ఏర్పాటు చేసిన కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం భానుకిరణ్ అన్నారు. 8లో



జాగా.. ఎవరిదో పాగా..

పారిశ్రామిక పట్టణంగా పేరుగాంచిన పాల్వంచలో భూముల ధరలు పెరగడంతో అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం

38° / 26°

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం చల్లగా ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



సాయికృష్ణను సత్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 293 ర్యాంకు సాధించిన కొత్తగూడెంకు చెందిన గ్రంధె సాయికృష్ణను కలెక్టర్ అనుదీప్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ, ఆయన కుటుంబ సభ్యులను సన్మానించాక కలెక్టర్ మాట్లాడారు. కోచింగ్ లేకుండా ర్యాంకు సాధించిన సాయికృష్ణ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. తాను సైతం సివిల్స్‌లో విఫలమైనా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆ తర్వాత విజయం సాధించానని గుర్తు చేసుకున్నారు. సాయికృష్ణ తల్లిదండ్రులు నాగలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హస్తంలో హైరానా!

పొంగులేటి కాంగ్రెస్‌లో చేరుతారని జోరుగా ప్రచారం

- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన శ్రీనివాసరెడ్డి
- కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న నేతల్లో మొదలైన గుబులు
- పొంగులేటి వస్తే తమ భవిష్యత్ ఏంటనే డైలమా!



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు పొంగులేటి చుట్టూ జరుగుతున్న ప్రచారానికి సరికొత్త రంగులు అద్దాయి. పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారంటూ ఈటల వ్యాఖ్యానించడాన్ని హస్తం పార్టీ రాష్ట్ర నాయకత్వం సానుకూల దృక్పథంతో పరిశీలిస్తే.. జిల్లా నేతలకు మాత్రం అశనిపాతంగా మారింది.

ప్రస్తుత నేతల పరిస్థితేంటి..?

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్, అశ్వారావుపేట నుంచి కాంగ్రెస్‌తో కూడిన మహాకూటమి తరఫున టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. వీరిలో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య మినహా ఒక టీడీపీ, ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారు. హస్తం గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీని వీడినా... గత మూడున్నరేళ్లకు పైగా ఆయా నియోజకవర్గాల్లో కేడర్‌లో ఆత్మవిశ్వాసం నింపుతూ పార్టీనే అంటిపెట్టుకుని కొందరు నేతలు ఉన్నారు. వీరిలో చాలా మంది వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లోకి పొంగులేటి అనే ప్రచారం వారికి మింగుడు పడటం లేదని హస్తం పార్టీలో జోరుగా ప్రచారం సాగుతోంది.

- కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వారిలో ఎడవల్లి కృష్ణ, నాగ సీతారాములు, పోట్ల నాగేశ్వరరావు ఉన్నారు. పొంగులేటి ఏ పార్టీలోకి వెళ్లినా ఖమ్మం, కొత్తగూడెంలో ఒక స్థానం నుంచి కచ్చితంగా పోటీ చేస్తారనే ప్రచారం ముందు నుంచీ ఉంది.

- అశ్వారావుపేటలో గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓడిపోయిన తాటి వెంకటేశ్వర్లు ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి ఆ నియోజకవర్గంలో హస్తం గుర్తుపై పోటీ చేయడమే లక్ష్యంగా ఆయన పని చేసుకుంటూ పోతున్నారు.
- పినపాక నుంచి పోటీ చేయడానికి చందా సంతోష్‌కుమార్, బట్టా విజయ్ గాంధీ, పోలేబోయిన శ్రీవాణి, కొమురం లక్ష్మణ్‌రావు, కాటిబోయిన నాగేశ్వరరావు, ధనసరి సూర్యతో పాటు మరికొందరు తటస్థులు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని ఎన్నికల్లో పోటీ చేయాలనే లక్ష్యంతో గత కొంత కాలంగా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.
- ఇల్లెందు అసెంబ్లీ స్థానం నుంచి గత రెండు పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తూ వచ్చారు. దీంతో ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు చీమల వెంకటేశ్వర్లు, డాక్టర్ జి. రవి, డాక్టర్ రామచంద్రునాయక్, భూక్యా దళ్‌సింగ్ ముందు నుంచీ పని చేస్తున్నారు. వీరితో పాటు కిషన్ నాయక్, విజయలక్ష్మి మరికొందరు ఆశావహులు ఉన్నారు.

అభ్యర్థుల ప్రకటనతో ఆందోళన..

నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న పొంగులేటి అభిమానుల ఆత్మీయ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ వైఖరి, కేసీఆర్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఈ క్రమంలోనే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ నియోజకవర్గం నుంచి తన తరఫున ఎవరు పోటీలో ఉంటారో కూడా ప్రకటిస్తూ వచ్చారు. రాబోయే రోజుల్లో ఏ పార్టీలో చేరినా తన వర్గం నేతలకు టికెట్లు ఇప్పించుకునే తెగువ, ధైర్యం, నమ్మకం తనకు ఉన్నాయంటూ ఆత్మీయ సమావేశాల్లో స్పష్టం చేశారు. ఈ క్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి జారె ఆదినారాయణ, భద్రాచలానికి తెల్లం వెంకట్రావు పేర్లు ప్రకటించారు. అంతకుముందే పొంగులేటి వర్గంలో కీలక నేతలుగా ఉన్న ప్రస్తుత జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇల్లెందు స్థానాన్ని ఆశిస్తుండగా, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పినపాక నుంచి పోటీకి సిద్ధంగా ఉన్నారు.

పెదవి విప్పని పొంగులేటి..

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలపై ప్రభావం చూపగల నేతగా పేరున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ కార్యాచరణపై రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొని ఉంది. బీఆర్ఎస్‌పై తిరుగుబాటు చేసిన పొంగులేటిని తమ పార్టీలోకి రావాలంటూ గత కొంత కాలంగా కాంగ్రెస్, బీజేపీ కోరుతున్నాయి. ఏ పార్టీలో చేరే అంశంపై ఆయన నుంచి నేటికీ స్పష్టత రాలేదు. మరోవైపు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తితో ఉన్న ప్రజా సంఘాలు, వ్యక్తులు, రాజకీయ పార్టీలతో కలిసి ఆయన కొత్త పార్టీ పెడతారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. తిరుగుబాటు జెండా ఎగురవేసి ఐదు నెలలు కావస్తున్నా, తన భవిష్యత్ పొలిటికల్ యాక్షన్ ప్లాన్‌పై పొంగులేటి గుంభనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయన అడుగులు ఎటు వైపనే అంశంపై రోజుకో తీరుగా ప్రచారం జరుగుతోంది.

నూతన ఓటర్లుగా నమోదు కావాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారంతా నూతన ఓటర్లుగా నమోదు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఐడీఓసీలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీలో రాజకీయ పక్షాలు అధికారులకు సహకరించాలని కోరారు. జాబితాలో ఎలాంటి పొరపాట్లు రాకుండా ఉండడానికి వారానికి ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లుగా ఉండకూడదని, ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండాలని అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహణలో ఈవీఎంలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సూచించారు. ఈ నెలలో ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎంల మొదటి దశ పరిశీలన చేస్తామని, అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని చెప్పారు. జిల్లాకు 1600 ఈవీఎంలను ఈసీ కేటాయించిందన్నారు. 1500 మంది కంటే ఎక్కువ ఓటర్లకు నివాసాలకు దూరంగా పోలింగ్ స్టేషన్లు ఉంటే, నూతన కేంద్రాల ఏర్పాటుకు రాజకీయ పార్టీలు ప్రతిపాదనలు అందజేయాలని కోరారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సురేష్, సిబ్బంది నవీన్, కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ, బీఎస్పీ ప్రతినిధులు శ్రీకాంత్, మధు, బాలరాజు, నోముల రమేష్, లక్ష్మణ్ అగర్వాల్, జట్టి ఆనందరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 లక్షల విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి కొత్తగూడేనికి చెందిన డి.రవికళ్యాణ్, హారిక దంపతులు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. మంగళవారం వారు శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులకు చెక్కు అందజేయగా, వారు రవికళ్యాణ్ దంపతులకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో సిబ్బంది రామిరెడ్డి, సాయిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

వైద్య సిబ్బందికి కేంద్ర బృందం సూచన



పీహెచ్‌సీ వద్ద కేంద్ర బృందం సభ్యులు, స్థానిక సిబ్బంది

ములకలపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కేంద్ర బృందం సభ్యులు సూచించారు. మంగళవారం వారు మంగపేట పీహెచ్‌సీని సందర్శించారు. ల్యాబ్, డెలివరీ గదిని, రూ.1.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆస్పత్రి నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రి నిర్వహణ, పేషెంట్ల వివరాలు, ప్రసవాల సంఖ్య తదితర రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని పీఆర్ ఏఈ శివలాల్‌ను ఆదేశించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి బాలింతలకు అందిస్తున్న కేసీఆర్ కిట్ల వివరాలు, ప్రభుత్వ ఆస్పత్రిల్లో ప్రసవాలు పెరిగేందుకు తీసుకుంటున్న చర్యలను స్థానిక వైద్యాధికారి సాయిక ల్యాణ్‌తో చర్చించారు. విధుల్లో అలసత్వం వహించవద్దని సూచించారు. గర్భిణులకు షెడ్యూల్ మేరకు మందులు అందించాలని, మెరుగైన వైద్య సేవలకు కృషి చేయాలని చెప్పారు. అనంతరం ములకలపల్లి, మూకమామిడి గ్రామాల్లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను (పల్లె దవాఖాన)లను సందర్శించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ ఆనంద్‌కుమార్, డాక్టర్ హైఫియా, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మణికంఠ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత పాల్గొన్నారు.

కబ్జాదారుల గుండెల్లో 'రైళ్లు'

రైల్వే స్థలాల ఆక్రమణపై డ్రోన్ కెమెరాతో ఫొటోలు, వీడియోలు తీసిన అధికారులు



డ్రోన్ కెమెరాతో సర్వే నిర్వహిస్తున్న రైల్వే అధికారులు

ఇల్లెందు: పట్టణంలోని రైల్వే భూములు దర్జాగా కబ్జాకు గురవుతున్నాయి. రైల్వే ట్రాక్ వెంట ఉన్న భూములతో పాటు స్టేషన్ సమీపంలోని భూముల్లో కూడా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీంతో కొందరు రైల్వే అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా.. అధికారులు వారం రోజులుగా ఈ భూములను నిశితంగా పరిశీలించారు. రైల్వే లైన్ వెంట, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో కబ్జాకు గురైన భూముల్లో మంగళవారం డ్రోన్ కెమెరాతో ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారు. దీంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఇల్లెందుకు ప్యాసింజర్ రైలు రద్దయిన తర్వాత రైల్వే ట్రాక్ వెంట ఉన్న స్థలాలను కొందరు కబ్జా చేసి పక్కా భవనాలు నిర్మించారు. రైల్వే స్టేషన్ కూడా ఎత్తేయడంతో ఆ స్థలంపై కొందరి కన్నుపడింది. వారు సైతం అక్రమ నిర్మాణాలు సాగిస్తుండటంతో గమనించిన స్థానికులు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డోర్నకల్ రైల్వే స్టేషన్ పరిధిలోని జూనియర్ ఇంజనీర్ జోకిన్ మంగళవారం ఇల్లెందులో సర్వే నిర్వహించారు. ఈ విషయమై ఆయనను విలేకరులు ప్రశ్నించగా.. రైల్వే స్థలాలను రక్షించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో తమ ఆధీనంలో ఉన్న భూములు, ప్రస్తుతం ఉన్న స్థలాలను మ్యాప్ ఆధారంగా గుర్తించి ఆక్రమణకు గురైనట్లు తెలిస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జూన్‌లో జిల్లాకు కేసీఆర్ !

ఎమ్మెల్యే వనమాకు సీఎం ఫోన్

కొత్తగూడెంఅర్బన్/సూపర్‌బజార్(కొత్తగూడెం): జూన్‌లో జరగనున్న పోడు పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు మంగళవారం రాత్రి కేసీఆర్ ఫోన్ చేసి మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో పోడు పట్టాల గురించి ఆరా తీశారు. సింగరేణి స్థలాలపై కూడా వనమాతో చర్చించారు. దీంతో పాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఆరా తీశారు. వచ్చే నెల 26 నుంచి పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం ఉండడం, పోడు సాగుదారులు జిల్లాలోనే ఎక్కువగా ఉండడంతో కేసీఆర్ వస్తారని సమాచారం.

51 వేల మందికి పోడు పట్టాలు..

జిల్లాలో 51 వేల మంది పోడు సాగుదారులకు వచ్చే నెలలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే వనమా తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో 5వేల మందికి పంపిణీ చేస్తామన్నారు. జూలైలో గృహలక్ష్మి పథకం కింద స్థలం ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల చొప్పున నియోజకవర్గంలో మూడు వేల మందికి ఇస్తామని వివరించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎక్కడా అవినీతి జరగకుండా కార్యకర్తలు పర్యవేక్షించాలని సూచించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్‌చైర్మన్ దామోదర్, వనమా రాఘవేంద్రరావు, నాయకులు ఎంఎ రజాక్, కాసుల వెంకట్, భీమా శ్రీధర్ పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో జిల్లాకు నాలుగు పతకాలు

యువజన, క్రీడల శాఖ అధికారి సీతారాం వెల్లడి



మాన్వితతో అసోసియేషన్ సభ్యులు

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారని యువజన, క్రీడల శాఖ అధికారి టి.సీతారాం తెలిపారు. కొత్తగూడేనికి చెందిన కె.మాన్విత మహిళల షాట్‌పుట్ విభాగంలో స్వర్ణ పతకం, పాల్వంచకు చెందిన అభినవ్‌నాయక్ లాంగ్ జంప్‌లో రజిత పతకం, రుద్రంపూర్‌కు చెందిన పి.అభిలాష్ 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, చర్లకు చెందిన నవీన్‌కుమార్ 100 మీటర్ల పందెంలో కాంస్య పతకం సాధించారని వివరించారు. క్రీడాకారులను రాష్ట్ర, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శులు కె.సారంగపాణి, కె. మహీధర్, జిల్లా చైర్మన్ జీవికే మనోహర్‌రావు, అధ్యక్షుడు గొట్టపు రాధాకృష్ణ, ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి రాజేంద్రప్రసాద్, కోచ్‌లు మల్లికార్జున్, సత్యబాబు, పి.నాగేందర్, ఎండీ గౌస్, స్కూల్ ఫెడరేషన్ సెక్రటరీ టీ.స్టెల్లా, జిల్లా పీఈటీ అసోసియేషన్ సెక్రటరీ బట్టు ప్రేమ్‌కుమార్ అభినందించారు.

సాగు..బాగుండేలా

- ప్రత్యేక ప్రాజెక్టును అమలుచేస్తున్న ప్రభుత్వం
- పైలట్‌గా కూసుమంచి వ్యవసాయ డివిజన్ ఎంపిక
- ప్రత్యేక సూచనలతో ప్రయోజనం పొందిన మిర్చి రైతులు
- ఈ ఏడాది జిల్లా అంతటా అమలుకు నిర్ణయం



మిర్చి ధర నిర్ధారిస్తున్న వ్యాపారులు



మిర్చి నాణ్యతను పరీక్షిస్తున్న సిబ్బంది

ఖమ్మం డెస్క్: సంప్రదాయ విధానాల్లో పంటల సాగుతో రైతులకు నష్టమే జరుగుతోంది. రసాయనిక మందులను ఇష్టారాజ్యంగా వాడుతుండడంతో కొత్త తెగుళ్లు పంటలను ఆశిస్తుండగా నివారణ చర్యలపై అవగాహన లేక దిగుబడి పడిపోతోంది. ఈనేపథ్యాన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు 'సాగు – బాగు' పేరిట ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో స్టార్టప్ కంపెనీలు, కేంద్రీకృత సంస్థలను భాగస్వామ్యం చేయడంతో సంస్థల ప్రతినిధులు రైతులకు సాగు మొదలు అమ్మకం వరకు ఎక్కడా నష్టం జరగకుండా సాంకేతిక సాయంతో అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాలతో కూడిన కూసుమంచి వ్యవసాయ డివిజన్‌లో మిర్చి పంటను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా.. రానున్న ఖరీఫ్‌లో జిల్లా అంతటా అమలుచేయాలని నిర్ణయించారు.

'డిజిటల్ గ్రీన్ సంస్థ' ద్వారా..

సాగు – బాగు ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో కమిషనర్‌గా వ్యవసాయ అడిషనల్ కమిషనర్ హనుమంతు కొడింబా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో కూసుమంచి వ్యవసాయ డివిజన్‌ను ఎంపిక చేయగా, డిజిటల్ గ్రీన్ సంస్థ సహకారంతో అమలుచేస్తున్నారు. ఇందుకోసం సదరు సంస్థ ప్రతినిధులు మూడు మండలాల్లో 25మంది సీఆర్పీలతో పాటు వీరిని పర్యవేక్షించేందుకు మండల స్థాయి ఎంఎల్ఈలను నియమించారు. వీరికి సాగు – బాగు ప్రాజెక్టుపై శిక్షణ ఇచ్చి నెలకు రూ.6వేల చొప్పున గౌరవ వేతనం కూడా చెల్లిస్తున్నారు.

ఏమేం చేస్తారంటే...

పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకున్న కూసుమంచి వ్యవసాయ డివిజన్‌లో 7వేల మంది మిర్చి రైతులను ఎంపిక చేసి వీరి భూముల్లో 1,050 చోట్ల భూసార పరీక్షలు నిర్వహించారు. అలాగే, రైతులకు సాంకేతిక సలహాలు ఇచ్చేందుకు మహబూబాబాద్ జిల్లా మల్యాలలోని వ్యవసాయ, ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త భాస్కర్‌ను ఎంపిక చేశారు. సంస్థ ప్రతినిధులు మిర్చి రైతులను సమావేశపర్చి ఎరువుల మోతాదు, పైరుకు ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. అంతేకాక క్షేత్రాల నుంచి చాట్‌బాట్ యాప్ ద్వారా పంట స్థితిగతులను శాస్త్రవేత్తకు వివరిస్తూ తీసుకోవాల్సిన మెళకువలను రైతులకు తెలియజేశారు.

ఆ తర్వాత..

మిర్చి చేతికి వస్తుండగా.. నాణ్యతను పరీక్షించేందుకు మూడు మండల కేంద్రాల్లో రైతు వేదికల్లో ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. తద్వారా తెగుళ్లు, పురుగులను గుర్తించడం, తేమశాతం, కాయ పొడవు, గింజల స్థితి, రంగు, ఘాటు గుర్తించడం వీలైంది. అలాగే, కాయలో ఫంగస్, బూజు వంటి వాటిని గుర్తిస్తూ పంటకు ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు కేటాయించారు. అనంతరం కాల్గుడి సంస్థ నుంచి బయ్యర్లను రైతులతో సమావేశపర్చి పంట కొనుగోళ్లకు ప్రోత్సహించారు.

లాభమేమిటి?

సాగు–బాగు ప్రాజెక్టు ద్వారా బయ్యర్లు నేరుగా రైతు సాగు క్షేత్రంలోనే పంటను కొనుగోలు చేశారు. తద్వారా రైతులు పంటను మార్కెట్‌కు, వ్యాపారి వద్దకు తరలించే బాధ తప్పడంతో పాటు రవాణా ఖర్చులు మిగిలాయి. అలాగే, ప్రభుత్వం విధించే మార్కెట్ పన్ను, వ్యాపారులకు ఇవ్వాల్సిన కమీషన్ మిగిలింది. నాణ్యత ఆధారంగా ప్రభుత్వం నిర్దేశించిన లేదా పంటకు ఉన్న డిమాండ్ ఆధారంగా ధర లభించడం, నగదు అయినా ఆన్‌లైన్ చెల్లింపులైనా అదే రోజు జరగడంతో రైతులకు ఎదురుచూపులు తప్పాయి. ఈ ఏడాది మూడు మండలాల్లో 150మెట్రిక్ టన్నుల మిర్చిని డిజిటల్ గ్రీన్ సంస్థ పర్యవేక్షణలో కాల్గుడి సంస్థ బయ్యర్లు క్వింటాకు నాణ్యత ఆధారంగా రూ. 18,500 నుంచి రూ.21,500 ధర చెల్లించి కొనుగోలు చేయడం విశేషం. రానున్న సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా మిర్చి సాగుతో పాటు మహబూ బాబాద్, వరంగల్ జిల్లాల్లోనూ సాగు–బాగు ప్రాజె క్టు అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించాం



వ్యవసాయ, ఉద్యానశాఖల సహకారంతో మిర్చి రైతుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించాం. సాగులో మెళకువలు, ఎరువుల వినియోగం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించగా పెట్టుబడులు తగ్గాయి. జిల్లాలో ఈ ప్రాజెక్టు మంచి ఫలితాలను ఇస్తోంది. – చంద్రగిరి యశోద, అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్, డిజిటల్ గ్రీన్ ప్రాజెక్టు

క్లుప్తంగా

కార్గో సేవలను ఆదరించండి

కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం భానుకిరణ్

జూలూరుపాడు/చండ్రుగొండ: టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం భానుకిరణ్ సూచించారు. జూలూరుపాడులో కార్గో సెంటర్‌ను మంగళవారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా 43కౌంటర్ల ద్వారా కార్గో సేవలు అందిస్తున్నామన్నారు. ఆయా కేంద్రాల ద్వారా పార్సిళ్లు, సురక్షితంగా, వేగంగా చేరవేస్తున్నట్లు చెప్పారు. తాజాగా కేజీ లోపు నుంచి పార్సిళ్ల చేరవేతకు ఏఎం టూ పీఎం, పీఎం టూ ఏఎం కార్యక్రమాన్ని ప్రారంభించామని, కేవలం రూ.99కే పార్సిల్ వేగంగా రవాణా చేస్తామన్నారు. తొలుత సీటీఎం భాను కిరణ్ కొత్తగూడెం ఆర్టీసీ బస్సు డిపోలోని కార్గో పాయింట్‌ను తనిఖీ చేశారు. వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల మేనేజర్ వేణుగోపాల్, ఖమ్మం రీజినల్ ఎగ్జిక్యూటివ్ హరివర్మ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రగతిపై డాక్యుమెంటరీ



డాక్యుమెంటరీ చిత్రీకరిస్తున్న బృందం

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా సాధించిన ప్రగతిని ప్రజలకు దృశ్యరూపకంగా వివరించేందుకు డాక్యుమెంటరీలు చిత్రీకరిస్తున్నారు. ఈమేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన బృందం ఇల్లెందు మండలం సంజయ్‌నగర్, పట్టణంలోని స్టేషన్ బస్తీ ప్రాథమిక పాఠశాలలతోపాటు ఉర్దూ మీడియం పాఠశాలల విశేషాలను చిత్రించారు. ఈసందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు కూడా సేకరించారు. జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ నాగరాజుశేఖర్, జిల్లా కమ్యూనిటీ కోఆర్డినేటర్ సైదులు, ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావు, హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు దమయంతి, రాజమణి, బుచ్చయ్య, అతియా ముంతాజ్, కృష్ణప్రియ పాల్గొన్నారు.


జిల్లాకు ఐదుగురు ఉపాధ్యాయులు

ఖమ్మంసహకారనగర్: లోకల్ కేడర్ ఆధారంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులను ఖమ్మం జిల్లాకు కేటాయించారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉపాధ్యాయులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో వెంటనే విధుల్లో చేరాలని సూచించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

భద్రాచలంటౌన్: దుమ్ముగూడెం మండలం ఆర్లగూడెం పోలింగ్ కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధ్యయన బృందం మంగళవారం సందర్శించింది. గతంలో జరిగిన పలు ఎన్నికల్లో స్థానిక 116 పోలింగ్ కేంద్రంలో అత్యధిక ఓట్లు పోలయ్యాయి. దీనిపై ఈసీకి ఫిర్యాదు అందగా, కారణాలు తెలుసుకునేందుకు ఎన్నికల కమిషన్ కార్యాలయం రీసెర్చ్ అధికారి జి.యాదయ్య ఆధ్వర్యంలో సభ్యులు విచారణ నిర్వహించారు. గ్రామ ఓటర్లు, సర్పంచ్, వార్డు మెంబర్ల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.ప్రతాప్, ఆర్ఐ లక్ష్మయ్య, ఆర్లగూడెం, కమలాపురం సర్పంచ్‌లు కొర్సా సునీత, బాలకృష్ణ, బీఎల్వో వీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని వాగు వద్ద కందకాలు



వాగు వద్ద కందకం తవ్వుతున్న దృశ్యం

పాల్వంచరూరల్: కిన్నెరసాని వాగులోని ఇసుకను యానంబైల్ నుంచి పాల్వంచకు అక్రమంగా రవాణా చేస్తున్న నేపథ్యంలో దానిని అరికట్టేందుకు తహసీల్దార్ రంగా ప్రసాద్ చర్యలు చేపట్టారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ హచ్యా మంగళవారం రంగాపురం, నాగారం గ్రామాల పరిధిలోని వాగు వద్ద పొక్లెయిన్‌తో కందకాలు తొవ్వించారు.

ఉరేసుకుని ఆదివాసీ ఆత్మహత్య

చర్ల: మండలంలోని జంగాలపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన ఓ ఆదివాసీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి సుమారు పదేళ్ల కిందట వలస వచ్చి మండలంలోని దండుపేట సమీపంలో గల ఇటుక బట్టి వద్ద కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న మడకం మంగయ్య (50) సోమవారం సాయంత్రం బట్టి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం మధ్యాహ్నం మండలంలోని జంగాలపల్లి సమీపంలో గల అటవీ ప్రాంతంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటువైపు వెళ్లిన పశువుల కాపరులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

జాగా.. ఎవరిదో పాగా..

- వివాదాస్పదంగా మారిన పాల్వంచలోని సర్వే నంబర్ 727లోని భూమి
- పట్టా భూములని కొందరు, ప్రభుత్వ భూమి అని పేదల పోరాటం
- మధ్యలో రియల్ వ్యాపారుల హస్తం



వెంగళరావుకాలనీలో వివాదాస్పదంగా మారిన భూమి

పాల్వంచ: పారిశ్రామికంగా పేరుగాంచిన పాల్వంచ పట్టణంలోని భూ దందా పెరిగిపోయింది. ఒకనాడు ఎందుకు పనికి రాని భూములు నేడు రూ.లక్షలు పలుకుతుండటంతో పలువురి కన్ను పడింది. నిత్యం భూదందాలు, సెటిల్‌మెంట్లు, బదలాయింపులు జరుగుతుండటంతో మధ్యలో అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో ఉన్న భూములకు పలువురు ధ్రువపత్రాలు సృష్టించి ఆ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇదిలాఉండగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని దశాబ్దాల కాలంగా అనేక పోరాటాలు సాగుతున్నా కనీసం వంద గజాల భూమి ఇచ్చేందుకు స్థలాలు లేవని పాలకులు చెబుతున్నారు. ఈ క్రమంలో రియల్ వ్యాపారులకు, పేదలకు మధ్య వివాదం జరుగుతోంది. ఈ కోవలో పాల్వంచ పట్టణంలోని వెంగళరావుకాలనీలో సర్వే నంబర్ 727లో ఉన్న మూడున్నర ఎకరాల స్థలం వివాదాస్పదంగా మారింది. ఈ వివాదం నిత్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతూ ఇటు పట్టణ వాసులకు, అదికారులకు తలనొప్పిగా మారుతోంది.

కొనసాగుతున్న వివాదం

సర్వే నంబర్ 727లోని మూడున్నర ఎకరాల భూమి ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. ఈ భూమి ప్రభుత్వం ఆధీనంలో ఉన్నప్పటికీ కొందరు పట్టాలు చేశారని, తర్వాత పలువురి చేతులు మారినట్లు చెబుతున్నారు. ఇటీవల ఈ స్థలం కాస్తా రియల్ వ్యాపారుల చేతుల్లోకి వచ్చింది. దీంతో ప్లాట్లు చేసి పలువురికి విక్రయించారు. కానీ, ఇది ప్రభుత్వ భూమి అని అందులో కొందరు పేదలు గుడిసెలు వేశారు. దీనికి రేవంత్‌నగర్ అని నామకరణం చేశారు. పేదలు గుడిసెలు వేస్తున్నారన్న ముందస్తు సమాచారంతో అప్పటికప్పుడు కొంత భూమిలో కొందరు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ పక్కనే కొద్ది పాటి భూమిలో గుడిసెలు వేశారు. ఇదే కాకుండా ఆ భూమి ఎదురుగా ఉన్న స్థలం సైతం వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఆ భూమిలో గతంలో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు చేసినా కార్యరూపం దాల్చలేదు. ఈ భూమిపై అక్రమంగా ధ్రువపత్రాలు సృష్టించారని హైకోర్టులో సైతం పిటిషన వేశారు. అసలు ఈ భూమి ప్రభుత్వానిదా? పట్టాదారులదా? రియల్ ఎస్టేట్ వ్యాపారులదా? అనేది తేలాల్సి ఉంది. దీనిపై రెవెన్యూ అధికారులు సర్వే చేసి సరైన నివేదిక తయారు చేయక పోవడంతో వివాదాలు సంవత్సరాల తరబడి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన వారు మోసపోయే ప్రమాదం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

పేదలకు న్యాయం జరిగేనా?

వెంగళరావుకాలనీలోని భూమిని ఇటీవల వందలాది మంది పేదలు ఆక్రమించుకుని, పోల్స్ పాతి, పట్టాలు కట్టుకుని అక్కడే కొన్ని రోజులుగా నివాసం ఉంటున్నారు. ఈ భూమిని ఇటీవల రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా జేసీబీలతో వచ్చి తొలగించే యత్నం చేశారు. దీంతో అక్కడి పేదలు తీవ్రంగా ప్రతిఘటించారు. కిరోసిన్ బాటిళ్లు తెచ్చుకుని ఆత్మహత్య చేసుకుంటామని అధికారులను ఎదురించారు. దీంతో వారు వెనుదిరిగారు. ఈ విషయంపై ఎంతటి ఆందోళనకైనా సిద్ధమని వారు స్పష్టం చేస్తున్నారు. వివాదాలకు కేంద్ర బిందువు అవుతున్న భూములపై అధికారులు సరైన చర్యలు చేపట్టలేదని, వాటిని రక్షించుకోవడంలో విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరికి పేదలకైనా న్యాయం జరుగుతుందా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఇటీవల పేదలు వేసిన గుడిసెలు

త్వరలోనే సర్వే చేస్తాం



సర్వే నంబర్ 727లో ప్రభుత్వ భూమి ఉంది. ఇటీవల పేదలు వేసిన భూమి కూడా ప్రభుత్వానిదే. అందుకే వారిని ఖాళీ చేయించే చర్యలు చేపట్టాం. కొందరు పాత పట్టాలు ఉన్నాయని చూపెడుతున్నారు. త్వరలో పూర్తి స్థాయిలో సర్వే చేస్తాం. ప్రభుత్వానిదని తేలితే వాటిని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తాం.

– రంగా ప్రసాద్, తహసీల్దార్, పాల్వంచ

పెట్రోల్ బంకులో అధికారుల తనిఖీ

డీజిల్‌లో నీళ్లు కలిశాయని వినియోగదారుల ఫిర్యాదు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సుజాతనగర్: స్థానిక పెట్రోల్ బంకులో సివిల్ సప్లయి, లీగల్ మెట్రాలజీ శాఖాధికారుల ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి.. చంద్రుగొండ మండలం తుంగారం, గానుగపాడు గ్రామాలకు చెందిన కొందరు రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం సోమవారం క్యాన్లలో డీజిల్ తీసుకెళ్లారు. ట్రాక్టర్‌లో డీజిల్ పోస్తున్న క్రమంలో అడుగుభాగాన నీరు, మట్టి పేరుకొని ఉండటం గమనించారు. దీంతో మంగళవారం ఉదయం బంకు వద్దకు చేరుకొని డీజిల్‌లో నీళ్లు వస్తున్నాయని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. ఈక్రమంలో వినియోగదారులు బంకు యాజమానితో ఫోన్‌లో మాట్లాడారు. సదరు యజమాని దురుసుగా సమాధానం చెప్పడంతో ఘటనపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా సివిల్ సప్లయి అధికారి మల్లికార్జున్, జిల్లా తూనికలు, కొలతల శాఖాధికారి మనోహర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల అనంతరం జిల్లా సివిల్ సప్లయి అధికారి మల్లికార్జున్ మాట్లాడుతూ డీజిల్‌లో నీళ్లు కలిశాయని ఫిర్యాదు ఇచ్చిన వారి సమక్షంలో తనిఖీలు చేశామని, డీజిల్, పెట్రోల్‌లో ఎలాంటి తేడాలు గమనించలేదన్నారు. స్టాకుతో పాటు, డెన్సిటీని పరిశీలించగా సరిగానే ఉన్నాయని చెప్పారు. వినియోగదారుల కోరిక మేరకు శాంపిళ్లను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. కాగా కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ గుగులోత్ బాలు మాట్లాడుతూ తరచూ ఇదే బంకులో కల్తీ ఆరోపణలు వస్తున్నందున సమగ్రంగా తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ సోయం కృష్ణ, ఆర్ఐ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యాలయాల్లో ఘనంగా ఉత్సవాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: తెలంగాణ పదో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం మంగళవారం ఆయన ఆశ్రమపాఠశాల హెచ్ఎంలు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఉత్సవాలపై సమీక్షించారు. జూన్ 3 నుంచి బడిబాట, 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యాన ఉత్సవాల నిర్వహణకు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. అలాగే, విద్యార్థులకు టెస్ట్, నోట్ బుక్స్, ఇతర మెటీరియల్ పంపిణీపై దృష్టి సారించాలని, పాఠశాలల్లో మైనర్ రిపేర్లపై ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పారు. పాఠశాలల పర్యవేక్షణకు ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించిందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు తానాజీ, రమణయ్య, నర్సింగరావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల మైదానం పరిశీలన



మైదానాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

ఇల్లెందు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించ తలపెట్టిన పట్టణంలోని జేకే సింగరేణి స్కూల్ మైదానాన్ని డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం షాలేమురాజు, ఇతర అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. కంపెనీ సాధించిన విజయాలపై ఫొటో ప్రదర్శన, లఘుచిత్ర ప్రదర్శన నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఇతర అధికారులు శ్రీనివాస్, ప్రహ్లాద్, బొల్లం వెంకటేశ్వర్లు, జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతుల వివరాలు సేకరణ



జిరాక్స్ ప్రతులు అందజేస్తున్న పోడు రైతులు

జూలూరుపాడు: పోడు భూమి సాగు చేసుకుంటున్న రైతులకు జూన్ 24 నుంచి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, రైతుబంధు కూడా అమలు చేస్తామని వెల్లడించింది. ఈ నేపథ్యాన అధికారులు పోడు రైతుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. జూలూరుపాడు మండలం నల్లబండబోడు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం పోడు రైతుల నుంచి రైతుబంధుకు అవసరమైన బ్యాంకు అకౌంట్, ఆధార్ జిరాక్స్‌ను సేకరించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ముక్తి నర్సింహారావు, కార్యదర్శి సెక్రటరీ జ్యోతి పాల్గొన్నారు.

ఆ రేషన్ బియ్యం బస్తాలెక్కడివో?



పట్టుబడిన బియ్యం బస్తాలు

సుజాతనగర్: రేషన్ బియ్యం రవాణాపై కేసులు నమోదవుతున్నా దళారులు మాత్రం ఆగడం లేదు. బయోమెట్రిక్ విధానం అమల్లోకి వచ్చినా బియ్యం దందా కొనసాగుతూనే ఉంది. మండలంలోని గరీబ్‌పేట గ్రామంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఇటీవల పట్టుబడినట్లు తెలుస్తోంది. గ్రామంలోని ఓ వ్యక్తి ఇంట్లో బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో 2 టౌన్ పోలీసులు దాడులు నిర్వహించగా.. మొత్తం 50 బస్తాలు (50 కేజీల చొప్పున) పట్టుబడ్డాయి. పట్టుబడిన బస్తాలన్నీ ప్రభుత్వ ముద్ర వేసిన గన్నీ బ్యాగులతోనే ఉండటం విశేషం. సాధారణంగా రేషన్ బియ్యం అమ్మే దళారులు లబ్ధిదారుల వద్ద నుంచి సేకరించి సాధారణ సంచుల్లో నింపి విక్రయిస్తారు. కానీ, ఇక్కడ పట్టుబడిన బస్తాలన్నీ గన్నీ బ్యాగులతోనే ఉన్నాయంటే ఈ దందా ఎంత యథేచ్ఛగా సాగుతుందో స్పష్టమవుతోంది. పట్టుబడిన బియ్యం నిల్వలను 2 టౌన్ పోలీసులు అదేరోజు స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ గోడౌన్ నుంచి ఈ బియ్యం నేరుగా ఇతని ఇంటికే వచ్చాయా? లేదా? రేషన్ షాప్ డీలరే ఇతనితో కుమ్మక్కయి బియ్యం విక్రయించాడా? అనే విషయాలు తేలాల్సి ఉంది.

ముగ్గురిపై కేసు నమోదు



డ్రైవర్ రమణపై దాడికి పాల్పడిన వ్యక్తులు

భద్రాచలంఅర్బన్: ఆర్టీసీ డ్రైవర్‌పై చేయిచేసుకున్న ముగ్గురు వ్యక్తులపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలాస ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో భద్రాచలం వచ్చేందుకు ఇద్దరు వ్యక్తులు టికెట్లు బుక్ చేసుకున్నారు. వారు బస్సు ఎక్కుతున్న సమయంలో మరో ముగ్గురు వ్యక్తులు కూడా అదే బస్సులో భద్రాచలం వచ్చేందుకు నిర్ణయించుకున్నారు. అప్పటికే బస్సు మొత్తం ప్రయాణికులతో నిండిపోయి ఉండటంతో డ్రైవర్ రమణ సదరు వ్యక్తులను దిగిపోవాలని సూచించాడు. అయినా వారు వినిపించుకోకుండా బస్సులోనే ఉండిపోయారు. కొంతదూరం వెళ్లాక మళ్లీ డ్రైవర్ వారిని దిగిపోవాలని సూచించాడు. దీంతో వారు డ్రైవర్‌పై కోపంతో భద్రాచలంలో ఉండే వారి బంధువులకు విషయం తెలిపారు. బస్సు భద్రాచలం చేరుకున్న అనంతరం గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు పలాస ఆర్టీసీ డ్రైవర్ రమణపై దాడి చేసి గాయపర్చారు. దీంతో డ్రైవర్‌ను భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ విషయంపై భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రామారావుకి ముందే ఫోన్ చేసి మరీ డ్రైవర్ రమణపై దాడి చేస్తామని బెదిరించినట్లు సమాచారం.

నన్ను ఆదుకోండి..

ఓ లారీ యజమాని ఆవేదన

అశ్వాపురం: ఆర్టీఓ చెప్పారని ధాన్యం లోడు ఎక్కించుకున్నందుకు ఓ లారీ యజమాని నానా అవస్థలు పడుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని చవిటిగూడెం గ్రామానికి చెందిన ఎల్లబోయిన అనిల్‌కుమార్‌కు లారీ ఉంది. గత శుక్రవారం ఈ లారీని పాల్వంచ చెక్‌పోస్టు వద్ద ఆర్టీఓ ఆపి ధాన్యం లోడు వేసుకోవాలని, గంటలో ధాన్యం దిగుమతి చేసుకుంటారని చెప్పాడు. అధికారి మాట కాదనలేక లారీ యజమాని అశ్వాపురం మండలం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చి 651 ధాన్యం బస్తాలు లోడ్ చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం భద్రాచలం మార్కెట్ యార్డుకు ధాన్యం తరలించాడు. మూడు రోజుల తర్వాత సోమవారం నిర్వాహకులు ధాన్యం శాంపిల్ తీసుకొని ధాన్యం వద్దని తిరస్కరించారు. దీంతో చేసేదేమీ లేక యజమాని తిరిగి మంగళవారం సాయంత్రం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. లారీ తిరిగితేనే తనకు బతుకుదెరువు అని, నాలుగు రోజులుగా ధాన్యం దిగుమతి చేయక, లారీ కిరాయి ఇవ్వక ఇబ్బంది పడుతున్నానని, అధికారులు న్యాయం చేయాలని సదరు లారీ యజమాని కోరుతున్నాడు.

ఇంటి పైనుంచి పడి వ్యక్తి మృతి

పాల్వంచ: గృహ ప్రవేశానికి వచ్చి ఇంటి పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని జగ్గుతండాకు చెందిన దేవేళ్ల దేవేందర్ నూతన ఇంటి గృహ ప్రవేశానికి ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం, పాలంపేటకు చెందిన సురేందర్ వచ్చాడు. సోమవారం రాత్రి ఇంటిపైన నిద్రించారు. మంగళవారం తెల్లవారుజామున మూత్ర విసర్జన కోసం లేచి కిందకు దిగే సమయంలో సురేందర్ జారి పడిపోయాడు. దీంతో అతడికి బలమైన గాయాలు కాగా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంటిపై పిట్టగోడ లేకపోవడంతో నిద్ర మత్తులో గమనించక జారి కింద పడ్డాడు. మృతుడి భార్య సుధ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినీ ఫక్కీలో గంజాయి రవాణా



ఇల్లెందురూరల్: నిందితులు, గంజాయితో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వాహన తనిఖీల్లో బయటపడిన వైనం

ఇల్లెందురూరల్: కొన్ని సినిమాల్లో చూపినట్లుగా గంజాయిని కొందరు తరలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో ఖమ్మం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇల్లెందు ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం నుంచి వస్తున్న కారును అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కారులో ఎలాంటి మాదకద్రవ్యాలు లభించకపోవడంతో వదిలేసేందుకు నిర్ణయించారు. ఇంతలోనే ఓ సినిమాలో చూపినట్లు స్టెప్నీ టైర్‌లో రవాణా చేస్తున్నారేమోనని అను మానించి కారు కింది భాగంలో ఉన్న స్టెప్నీ టైరును పరిశీలించారు. అందులో 25 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి ఆశ్చర్యపోయారు. వెంటనే గంజాయిని, కారును స్వాధీనం చేసు కుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వాహన తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వై.సురేశ్, ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ముబషీర్, ఇల్లెందు ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంలో 13 కేజీలు



నిందితులు, గంజాయిని చూపిస్తున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని గోదావరి కరకట్ట వద్ద గంజాయిని విక్రయిస్తున్న, కొనేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులను టాస్క్ ఫోర్స్, భద్రాచలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,60,000 విలువైన 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం గోదావరి కరకట్ట వద్ద టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ, ఎస్ఐలు తిరుపతి, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మల్కన్‌గిరి జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్, మంగళ కలిసి ఆంధ్ర – ఒడిశా సరిహద్దులోని సీలేరులో 13 కేజీల గంజాయిని కొనుగోలు చేసి.. హైదరాబాద్‌కు చెందిన దంపతులు అర్జున్‌సింగ్, నందినికి విక్రయిస్తున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేలోగానే ఒకరు పరారు కాగా, మిగిలిన ముగ్గురితోపాటు గంజాయి విక్రయించేందుకు సహకరించిన మరో వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టణ సీఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టాస్క్‌ఫోర్సు అధికారులు, భద్రాచలం పోలీసులను ఏఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

భూగర్భ గనిలో ప్రమాదం


ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు



గాయపడిన గణశ్యామ్ (ఫైల్)

మణుగూరు రూరల్ : సింగరేణి మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గనిలో మంగళవారం సిలిండర్ పేలిన ఘటనలో ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఎంఎస్ కంపెనీకి చెందిన ఫిట్టర్ గణశ్యామ్ బెహరా, హెల్పర్ ఎస్.సి. సింగ్ ఐదో లెవల్ ఎల్‌హెచ్‌డీ యంత్రం వద్ద మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదశాత్తు సిలిండర్ పేలడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. గణశ్యామ్‌ను మెరుగైన వైద్యం కోసం తొలుత కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ కామినేని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలియగానే ఏరియా జీఎం దుర్గం రామచందర్ సింగరేణి ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. కాగా, గణశ్యామ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎస్.సి.సింగ్ కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు



గాయపడిన చరణ్

ములకలపల్లి: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు గాయపడిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన చరణ్ మండలంలోని ఎలకంవారిగుంపు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం ములకలపల్లిలో బంధువులు నిర్వహిస్తున్న సూపర్‌మార్కెట్‌కు వచ్చాడు. దాబా పైకి ఎక్కిన సమయంలో కోతులకు భయపడి పరుగుతీశాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు, క్షతగాత్రుడిని వెంటనే స్థానిక మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చర్ల: మద్యం మత్తులో పురుగులమందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దుమ్ముగూడెం ఎస్ఐ కేశవ్ కథనం ప్రకారం.. జడ్.వీరభద్రాపురం గ్రామానికి చెందిన సున్నం బొజ్జి (32) నిత్యం మద్యం సేవిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో పురుగులమందు తాగడంతో కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మంగళవారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.